క్లుప్తంగా

తాగునీరు వృథా



మహారాణి పార్లర్ కూడలి వద్ద వాల్వ్ లీకై వృథాగా పోతున్న తాగునీరు

సీతంపేట: అక్కయ్యపాలెం మెయిన్ రోడ్డులోని మహారాణి పార్లర్ కూడలి వద్ద కుళాయిలకు నీరు పంపిణీ చేసే కంట్రోలింగ్ వాల్వ్ లీకవుతోంది. దీంతో రోడ్డుపై నుంచి తాగునీరు వృథాగా పోతోంది. సంబంధిత అధికారులు పరిశీలించి నీటి వృథాను అరికట్టేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

తీరం.. జనసంద్రం



రుషికొండ బీచ్‌లో పర్యాటకుల సందడి

కొమ్మాది: పర్యాటక ప్రాంతాల్లో ఆదివారం ఉదయం నుండి సాయంత్రం వరకు పర్యాటకుల తాకిడి కనిపించింది. గుడ్లవానిపాలెం బీచ్, సాగర్‌నగర్ బీచ్, రుషికొండ బీచ్, తొట్లకొండ బీచ్, రామానాయుడు ఫిల్మ్ స్టూడియో, ఎర్రమట్టి దిబ్బలు, భీమిలి బీచ్ ప్రాంతాల్లో పర్యాటకుల సందడి నెలకొంది. చిన్నా పెద్దా అంతా ఉత్సాహంగా గడిపారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఆర్‌ఎం అప్పలనాయుడు

మధురవాడ: ఏపీఎస్‌ఆర్‌టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని ఆర్‌ఎం అప్పలనాయుడు చెప్పారు. ఆదివారం మధురవాడలో నిర్వహించిన రిటైర్డ్ ఎంప్లాయిస్ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు వారు ఎదుర్కొంటున్న సమస్యలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఆయన స్పందిస్తూ ఈపీఎఫ్‌కి సంబంధించి సరైన డాటా అందించాల్సి ఉందన్నారు. ఒక్క అక్షరం కూడా తప్పు లేకుండా 10డి ఫారాలు నింపి పంపాలన్నారు. దీనికి ఎటువంటి సహకారం కావాలన్నా విశాఖ జిల్లాలో ఉన్నా యూనిట్లను సంప్రదించవచ్చన్నారు. ఆరోగ్య సమస్యలు పరిష్కారానికి రిటైర్డ్ ఆర్‌టీసీ ఉద్యోగి, గుండె వైద్య నిపుణుడు అయిన సుబ్రహ్మణ్యాన్ని సంప్రదించాలని, ఎంవీపీలోని సంస్థ డిస్పెన్సరీలో ప్రతి శుక్రవారం ఉచిత కన్సల్టేని సద్వినియోగం చేసుకోవాన్నారు. కార్యక్రమంలో ఏవీ రావు, రాయి, ఇతర విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

మటన్ షాపులు కిటకిట



నియోజకవర్గంలోని మటన్, చికెన్ షాపులు ఆదివారం వినియోగదారులతో కిటకిటలాడాయి. దసరా పండగ సందర్భంగా గురువారం మాంసాహారానికి దూరంగా ఉన్న వారు.. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి ఆదివారం విందు భోజనాలు చేశారు. శనివారం అర్ధరాత్రి నుంచే మేకలు, గొర్రెలు, కోళ్లను వ్యాపారులు సిద్ధం చేశారు. సీతంపేట, అక్కయ్యపాలెం, సీతమ్మధార తదితర ప్రాంతాల్లోని నాన్ వెజ్ దుకాణాలన్నీ జనంతో రద్దీగా కనిపించాయి. వైన్ షాపుల వద్ద మందుబాబులు క్యూ కట్టారు. అందరూ దసరా పండగ జోష్‌లో మునిగి తేలారు.

– ఫొటోలు, సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



సమస్యల వలయం

- మురళీనగర్ స్కేటింగ్ పార్క్ పరిసరాల్లో ప్రమాదకర పరిస్థితులు
- భారీ వాహనాల రాకపోకలతో రహదారులు ఛిద్రం
- రాత్రి పూట చైన్ స్నాచింగ్స్
- స్థానికుల ఫిర్యాదులను పట్టించుకోని అధికారులు



పాత గ్యాస్ గొడౌన్ రహదారిలో తొలగించని చెట్ల కొమ్మలు



పైకప్పు లేని మ్యాన్‌హోల్



ప్రమాదకరంగా రోడ్డు అంచులు



భారీ వాహనాల రాకపోకలతో కుంగిన వాటర్ ట్యాంక్ రహదారి

మురళీనగర్: మురళీనగర్‌లో అత్యంత ప్రాధాన్యత కలిగిన స్కేటింగ్ పార్క్ పరిసరాల్లోని నివాసులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. ఈ పార్క్ చుట్టూ ఒక వలయంలా ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. రహదారులు కుంగిపోవడం, మ్యాన్‌హోళ్లు శిథిలమవడం, ప్రధాన కూడలిలో లైట్లు వెలగక రాత్రి పూట గొలుసు దొంగతనాలు జరగడం వంటి సమస్యలు వేధిస్తున్నాయి. ఈ సమస్యలపై ఫిర్యాదు చేసినా.. అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు.

ఒకరి స్వార్థం.. రహదారికి శాపం

స్కేటింగ్ పార్క్ నుంచి వాటర్ ట్యాంక్‌కు వెళ్లే రహదారి కుంగిపోయి శిథిలమవడంతో పరిసర ప్రాంతాల నివాసుతులు అవస్థలు పడుతున్నారు. వాటర్ ట్యాంక్ సమీపంలోని ఇసుక, బ్లాక్ మెటల్ నిల్వ చేసుకుని ఒకరు గుట్టుగా వ్యాపారం సాగిస్తున్నారు. ఇక్కడికి భారీ వాహనాలు అత్యధిక ఇసుక లోడ్‌తో ఈ రహదారి మీదుగా ప్రయాణిస్తుంటాయి. 12 చక్రాల వాహనాలతో ఇక్కడికి ఇసుక లోడ్ వస్తుంది. దీంతో ఈ రహదారి కుంగిపోయి శిథిలావస్థకు చేరుకునే పరిస్థితి ఏర్పడింది. ఒక వ్యాపారి స్వార్థం వల్ల పక్కా రహదారి శిథిలమవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఏమాత్రం అజాగ్రత్తగా ప్రయాణించినా ప్రమాదాల పాలవుతున్నారు.

ప్రమాదకరంగా మ్యాన్‌హోళ్లు

స్కేటింగ్ పార్క్‌ను ఆనుకుని స్విమ్మింగ్ పూల్ ప్రహరీ గోడ వెనుక రహదారిలోని మ్యాన్‌హోళ్లు ప్రమాదకరంగా తయారయ్యాయి. వాకర్స్ పార్క్ సమీపంలోని మ్యాన్‌హోల్ పైకప్పు శిథిలావస్థకు చేరినా పట్టించుకునే నాథుడు లేడు. స్విమ్మింగ్ పూల్ వెనుక డ్రైనేజీ మలుపులో పైకప్పు వేయకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. పార్కు ఉత్తర రహదారిని ఆనుకుని ఉన్న అంచులు వర్షాలకు బురదమయంగా తయారవడంతో వాహన చోదకులు, సైక్లిస్టులు జారిపడి గాయాల పాలవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఇక్కడి సమస్యలను తక్షణం పరిష్కరించాలని స్కేటింగ్ పార్క్ పరిసర నివాసులు, వాకర్స్ కోరుతున్నారు.

కూడలిలో చీకట్లు

స్కేటింగ్ పార్క్ ప్రధాన కూడలిలో రాత్రి పూట చీకట్లో ప్రయాణించాల్సి వస్తోంది. ఇక్కడ ఏర్పాటు చేసిన నాలుగు హైమాస్ట్ లైట్లు 15 రోజులుగా వెలగడం లేదని స్థానికులు చెబుతున్నారు. దీంతో స్కేటింగ్ పార్క్ వెనుక, దాని అనుబంధ వాటర్ ట్యాంక్ రహదారి, పాత గ్యాస్ గొడౌన్ ప్రాంతాల్లో అంధకారం నెలకొంది. చిన్నారులు పార్కుకు వచ్చి పోయే సమయంలో వాహనాలు ఢీకొని ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రి పూట చైన్ స్నాచింగ్స్ జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. దీనిపై వీధి లైట్ల విభాగం అధికారులు తక్షణం స్పందించాల్సి ఉంది. పాత గ్యాస్ గొడౌన్ రహదారిని ఆనుకుని పేరుకుపోయిన చెట్ల కొమ్మలను నాలుగు రోజులుగా తొలగించకుండా వదిలేశారు.



వెలగని హైమాస్ట్ లైట్లు

వాల్తేర్ డివిజన్‌లో స్వచ్ఛ భారత్ స్పెషల్ డ్రైవ్



మాట్లాడుతున్న డీఆర్‌ఎం లలిత్ బోహ్రా

తాటిచెట్లపాలెం: స్వచ్ఛ భారత్ స్పెషల్ క్యాంపెయిన్–5లో భాగంగా వాల్తేర్ డివిజన్ పరిధిలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు డీఆర్‌ఎం లలిత్ బోహ్రా తెలిపారు. రైల్వే అధికారులతో ఆదివారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించి కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. ఈ నెల 2న ప్రారంభమైన క్యాంపెయిన్‌లో భాగంగా డీఆర్‌ఎం లలిత్ బోహ్రా నేతృత్వంలో పలువురు ఉన్నతాధికారుల బృందం రైల్వే బోర్డు నిర్దేశించిన సూచనలతో ఈ కార్యక్రమాలను పర్యవేక్షిస్తుందని వాల్తేర్ డివిజన్ అధికారులు చెప్పారు. వాల్తేర్ డివిజన్ ప్రత్యేక కార్యాచరణను రూపొందించి, ప్రత్యేక వాట్సాప్ గ్రూప్ ద్వారా వారికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. పెండింగ్ రిఫరెన్సెస్, పాత ఫైళ్ల పరిశీలించి సాధ్యమైనంత త్వరగా వీటిని పరిష్కరిస్తారని చెప్పారు. ఈ వేస్ట్ మేనేజ్‌మెంట్, స్క్రాప్ మెటీరియల్ డిస్పోజల్ వంటి పనులు చేపట్టనున్నారని, ప్రత్యేక కార్యక్రమాల ద్వారా వాల్తేర్ డివిజన్ స్వచ్ఛతలో మరో నూతన అడుగు వేయనున్నట్లు తెలిపారు.

మహా అన్నదానం

మురళీనగర్: మురళీనగర్ రామాలయంలో కొలువైన లలితాదేవి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం మహా అన్నసమారాధన నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నదానం చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయ నిర్వహణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు టీఎన్ రెడ్డి, ఎస్.వరప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నవ్వుల్లో ముంచెత్తిన వినోదాల విందు



స్కిట్ ప్రదర్శిస్తున్న సుబ్రహ్మణ్యం, ప్రకాష్

సీతంపేట: ఫ్రెండ్స్ కామెడీ క్లబ్(విశాఖ, హైదరాబాద్) ఆధ్వర్యంలో ప్రతి నెలా నిర్వహించే వినోదాల విందులో భాగంగా ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో కామెడీ షో జరిగింది. క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.వి.సుబ్రహ్మణ్యం అధ్యక్షతన కళాకారులు జబర్దస్త్ ప్రకాష్, పుష్యమి, రాగస్ నాయుడు, సూర్య, ఎస్.ఎస్.నాయుడు, పోర్టు శేషు, భానుప్రకాష్‌లు ప్రదర్శించిన కామెడీ స్కిట్లు ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తాయి. అత్తగారి ఏడుపు, థియేటర్‌లో ఉన్నాను, కవిత, అన్నదానం, ఎంతమంది పిల్లలు, దారి ఎటు పోతుంది, సెలూన్, ఇంజినీరింగ్ కుటుంబం, రేటు ఎంత, డాక్టర్ పేషెంట్, డిశ్చార్జ్ ఎప్పుడు నాటికలు అలరించాయి. శివా క్లాసికల్ డ్యాన్స్ మ్యూజిక్ అకాడమీ అండ్ యోగా గురువు శివా శిష్య బృందం లిఖిత, సంజన చేసిన శాస్త్రీయ నృత్యం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా కళాకారులను అతిథులు సన్ మూర్తి, మాల్యాద్రి, సాత్యకి ప్రసాద్, విశ్రాంత డీపీఆర్‌వో ఎల్.బి.వెంకటరావు చేతుల మీదుగా సత్కరించారు.

ఉపాధ్యాయులకు సత్కారం



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న హెచ్‌ఆర్‌సీ ప్రతినిధులు

సీతంపేట: ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా హ్యూమన్ రైట్స్ సెల్ ఆధ్వర్యంలో ఆదివారం అక్కయ్యపాలెం మెయిన్ రోడ్‌లోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ పైన సెమినార్ హాల్‌లో ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. హెచ్‌ఆర్‌సీ రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి జె.ఎం.నాయుడు హెచ్‌ఆర్‌సీ ప్రాధాన్యాన్ని వివరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.ఎస్.వి.విశ్వనాథం ఉపాధ్యాయ దినోత్సవ ప్రాధాన్యత తెలియజేశారు. జాతీయ ఉపాధ్యాయుడు రామ్‌సింగ్ అవార్డు గ్రహీత రెడ్డిపల్లి అప్పలరాజుని, ఎన్‌జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్ ఉపాధ్యాయులు సునీత, శ్యామల, విన్నకోట ఫణికుమార్, ఎ.రామలక్ష్మిలను సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జయంతి రాధాకుమారి, ఉపాధ్యక్షుడు సుదర్శన పట్నాయక్, మంగయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యోగా పుస్తకాలు



విద్యార్థులకు యోగా పుస్తకాలు అందజేస్తున్న తులసీరావు

జగదాంబ: యోగా అందరి జీవితంలో భాగం కావాలని, యోగా ద్వారానే పరిపూర్ణ జ్ఞానం పొందవచ్చని రిషి సంపద ఆశ్రమ నిర్వాహకులు తులసీరావు అన్నారు. వివేకానంద సంస్థలో జరుగుతున్న చిన్నారుల యోగా శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు శ్రీకృష్ణ చైతన్య యోగా కేంద్రం సంపూర్ణ యోగాభ్యాసం 1,2 పుస్తకాలను బహుమతిగా అందించారు. చక్కగా యోగాసనాలు వేస్తున్నారని విద్యార్థులను అభినందించారు. విద్య, కూచిపూడి నృత్యాలు, యోగా వంటి వాటిలో విద్యార్థులకు తర్ఫీదు ఇస్తున్న వివేకానంద సంస్థ అధ్యక్షుడు అప్పారావుని అభినందించారు. ఈ కార్యక్రమంలో యోగా మాస్టర్ గణేష్, సంస్థ అధ్యక్షుడు అప్పారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సందడి చేస్తున్న జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ హైస్కూల్ పూర్వ విద్యార్థులు

దాబాగార్డెన్స్: జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ హైస్కూల్ 1987–88 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయంగా కలిశారు. స్పర్శ స్వచ్ఛంద సంస్థ ద్వారా మధురవాడ ఐటీ హబ్‌లో ఉన్న ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో వీరంతా కలుసుకున్నారు. సమ్మేళనంలో దేశ, విదేశాల్లో స్థిరపడిన మిత్రులందరు ఒకే వేదికపై కలుసుకుని ఆత్మీయంగా ఒకరినొకరు పలకరించుకుని సరదాగా గడిపారు. ఈ సందర్భంగా నృత్యాలు చేస్తూ ఎంజాయ్ చేశారు. వయసు మరిచిపోయి 50 ఏళ్లు దాటినా.. 20 ఏళ్ల కుర్రాళ్లలా గంతులేశారు. 12 ఏళ్ల కిందట ఏర్పాటు స్పర్శ సంస్థను ఏర్పాటు చేశామని, ప్రతి ఏటా అక్టోబర్‌లో మిత్రులంతా కలుసుకుంటామని వ్యవస్థాపక అధ్యక్షుడు బొట్ట శ్రీరాములు తెలిపారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి కర్రి సంజయ్ ఆలపించిన పాటలు అలరించాయి. కార్యక్రమ విజయవంతానికి కృషి చేసిన ఆర్గనైజర్లు రషీద్, దుక్క పరమేశ్వరరావు, ఖాదరవల్లీ, సునీల్, కాకి శ్రీనుతో పాటు సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికీ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీరాములు, కార్యదర్శి శ్రీను, సహాయ కార్యదర్శి ఇబ్రహీం, కోశాధికారి పెంటకోట నగేష్ కృతజ్ఞతలు తెలిపారు.



ఏవీఎన్ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం

భీమునిపట్నం: విశాఖ ఏవీఎన్ కళాశాలలో 1977 నుంచి 1980 వరకు సైన్స్ డిగ్రీ చేసిన పూర్వ విద్యార్థులు 40 మంది కోట పద్మారాణి నివాసం వద్ద కలుసుకున్నారు. చిన్నపిల్లల్లా సరదాగా గడిపారు. అప్పటి రోజుల్లో ఎలా ఉండేవారు, సరదాల గురించి మాట్లాడుకుని ఎంతో సంతోషించారు. డాక్టర్ విశ్వేశ్వరరావు, ప్రొఫెసర్ మురళి, పారిశ్రామిక వేత్త మోహనరావు, రైల్వే అధికారి బాలాజీ, మెరైన్ ఇంజినీర్ శ్రీనివాసరావు తమ అనుభవాలను తెలిపారు. ఈ సందర్భంగా తాము చదువుకున్న కళాశాలకు తగిన మేరకు సాయం చేయాలని నిర్ణయించారు. సాయంత్రం వరకు అందరు ఆనందంగా గడిపి తిరిగి తమ గమ్యస్థానాలకు పయనమయ్యారు.

ఎక్కడ కూలిన చెట్లు అక్కడే..



సత్యం సెంటర్ వద్ద గ్రీన్‌బెల్ట్‌లో వాకింగ్ ట్రాక్‌పై కూలిన చెట్లు



సత్యం జంక్షన్ వద్ద హైవేపై వదిలేసిన చెట్ల కొమ్మలు



గురుద్వారా కూడలి వద్ద గ్రీన్‌బెల్ట్‌లో తొలగించకుండా వదిలేసిన చెట్లు



మురళీనగర్ బ్యాంక్ వీధిలో పేరుకుపోయిన చెట్ల వ్యర్థాలు



48 బస్ రూట్ అనుబంధ రహదారిలో వదిలేసిన చెట్ల కొమ్మలు

తక్షణం తొలగించాలని స్థానికుల విజ్ఞప్తి

సీతంపేట: దసరా పండగ రోజున సంభవించిన గాలివాన బీభత్సానికి 25వ వార్డు హైవే పక్కన గ్రీన్‌బెల్ట్‌లో చాలా చెట్లు పడిపోయాయి. నాలుగు రోజులు గడిచినా.. వాటి తొలగింపు జరగలేదు. సత్యం సెంటర్ వద్ద గ్రీన్‌బెల్ట్‌లో వాకింగ్ ట్రాక్‌కు అడ్డంగా మూడు చెట్లు పడిపోయాయి. దీంతో స్థానికులు ఉదయం, సాయంత్రం వాకింగ్‌కు అడ్డంకిగా మారింది. గురుద్వారా సమీపంలోని గ్రీన్‌బెల్ట్‌లో రెండు భారీ చెట్లు నేలకూలాయి. చెట్లు పడిపోవడంతో ఇటీవల గ్రీన్‌బెల్ట్‌కు ఏర్పాటు చేసిన ఐరన్ ఫెన్సింగ్ ధ్వంసమైంది. గ్రీన్‌బెల్ట్‌లో పడిపోయిన చెట్లు కొమ్మలు హైవే పైకి విస్తరించి ఉండటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. సంబంధిత అధికారులు స్పందించి కూలిన చెట్లను తక్షణం తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

పేరుకుపోయిన చెట్ల వ్యర్థాలు

మురళీనగర్: మురళీనగర్ పరిసర ప్రాంతాల్లోని రహదారులు చెత్తమయంగా తయారయ్యాయి. తాజాగా కురుస్తున్న వర్షాలకు చెట్ల కొమ్మలు విరిగి పడటంతో వాటి వ్యర్థాలు రహదారుల వద్ద పేరుకుపోయాయి. వర్మా కాంప్లెక్స్, బ్యాంకు వీధి, అనుబంధ రహదారుల్లో చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. కొమ్మలతోపాటు చెట్ల ఆకులు, ఇతర వ్యర్థ పదార్థాలు పేరుకుపోవడంతో రహదారులన్నీ అపరిశుభ్రంగా మారాయి. పలు ప్రాంతాల్లోని డంపర్ బిన్‌లు నిండిపోయి చెత్త రోడ్లపై పడి దుర్గంధం వెదజల్లుతోంది. జీవీఎంసీ అధికారులు స్పందించి తక్షణం వ్యర్థాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

దుమ్ము రేగుతోంది

- భారీ వాహనాల రాకపోకలతో ప్రమాదాలు
- మట్టితో నిండిన సీసీ రోడ్లు
- స్పందించని కాలుష్య నియంత్రణ మండలి అధికారులు
- మురికివాడల ప్రధాన రహదారిపై చిన్నచూపు



భారీ వాహనాల రాకపోకలతో ధూళిమయంగా రహదారి

కంచరపాలెం: కంచరపాలెం నుంచి మర్రిపాలెం వెళ్లే రైల్వే వాషింగ్ లైన్ రహదారులు దుమ్ము, ధూళితో నిండిపోయాయి. మట్టి రోడ్లను తలపిస్తున్నాయి. దీంతో సామాన్య ప్రజానీకానికి ప్రయాణం నరకప్రాయంగా మారింది. మరోవైపు భారీ టిప్పర్ల రాకపోకలతో దుమ్ము, ధూళి రేగడంతో సమీప ప్రాంతాల వారు అనారోగ్యం బారిన పడుతున్నారు. అయినా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడడం లేదని ప్రజలు వాపోతున్నారు.

ఇదీ పరిస్థితి..

కంచరపాలెం ఎఫ్‌సీఐ గిడ్డంగి రహదారి నుంచి పైడిమాంబ ఆలయం మీదుగా దయానందనగర్, రాజీవ్‌కాలనీ, చాకలిగెడ్డ ముత్యమాంబ కాలనీ, సాంబమూర్తినగర్, ఆశవానిపాలెం, శ్యామ్‌నగర్, అశోక్‌పార్క్, మేఘాద్రిపేట ప్రాంత ప్రజలు రాకపోకలు సాగిస్తారు. దుమ్ము రహదారుల్లో నిత్యం అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు. గతేడాది ఆయా కాలనీల్లో సీసీ రోడ్లు వేశారు. రహదారులు పోర్టు, రైల్వే ఆధీనంలో ఉండడంతో జీవీఎంసీ పారిశుద్ధ్య అధికారులు అటుగా కన్నెత్తి చూడకపోవడంతో రహదారులు మట్టి రోడ్లను తలపిస్తున్నాయి. రోడ్లు శుభ్రపరచాలంటూ జీవీఎంసీ, పోర్టు, రైల్వే అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం శూన్యంగా ఉందని వాపోతున్నారు. సాంబమూర్తినగర్ శివాలయం నుంచి డీజిల్ లోకోషెడ్, వాషింగ్ లైన్‌కు వెళ్లే మార్గాలకు ఇరువైపులా షిప్పింగ్ కంపెనీలకు చెందిన బొగ్గు ఇతర ఖనిజాలు నిల్వ చేస్తారు.

అనారోగ్య సమస్యలు

రహదారులపై ఎగిరిన దుమ్ము, ధూళి రాజీవ్‌కాలనీ, ముత్యమాంబకాలనీ, చాకలిగెడ్డ, దయానందనగర్, పైడిమాంబకాలనీల్లో ఇళ్లపై పడుతుండడంతో ఊపిరితిత్తుల సమస్యలు ఎక్కువగా ప్రబలుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. జీవీఎంసీ శానిటరీ సిబ్బంది ఇక్కడ మచ్చుకు కూడా కనిపించడంలేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు ప్రమాదకర రహదారులను పరిశీలించి దుమ్ము తొలగించేటట్లు చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.



సాంబమూర్తినగర్ శివాలయం వద్ద దుమ్ము, ధూళితో నిండిన రహదారి

భారీ వాహనాలతో అవస్థలు

బొగ్గు, ఇతర పదార్థాలు తరలించేటప్పుడు కనీస ప్రమాణాలు పాటించడం లేదు. దీంతో భారీ వాహనాలు రాకపోకలు సాగించేటప్పుడు ద్విచక్ర వాహనాలు, పాదచారుల కళ్లలోకి దుమ్ము చేరుతుంది. నిత్యం వేల సంఖ్యలో రైల్వే లోకో, డీజిల్ షెడ్ ఉద్యోగులు, నేవల్ డాక్‌యార్డ్, షిప్‌యార్డ్ ఉద్యోగులతో పాటు ఆయా కాలనీ ప్రజలు ధూళితో ఇబ్బందులు పడుతున్నారు. దుమ్ము రేగే రహదారుల్లో ఆయా కంపెనీలు వాటర్ ట్యాంకర్లతో నీరు జల్లాని నిబంధనలు ఉన్నా పట్టించుకునే నాథుడు కనిపించడంలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుమ్ము కళ్లల్లోకి చేరడంతో ప్రయాణం ప్రమాదభరితంగా మారుతోంది.



మర్రిపాలెం రైల్వే యార్డ్ రహదారి నుంచి కంచరపాలెం వైపు ప్రయాణిస్తున్న భారీ టిప్పర్